ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 వరంగల్

గురువారం 18 ఏప్రిల్ 2024



ఊకల్‌లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో..

కల్యాణం.. కమనీయం..

నేత్రపర్వంగా సీతారాముల కల్యాణోత్సవం

- అపర మిథిలా నగరంగా శోభిల్లిన ఓరుగల్లు
- వేడుకలకు పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తజనం
- భద్రకాళి, ఊకల్ నాగసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల్లో వైభవంగా రాములోరి పెళ్లి



వరంగల్‌లోని గోవిందరాజుల గుట్టపై సీతారాముల కల్యాణోత్సవ వేడుకల దృశ్యం



దత్తక్షేత్రంలో కల్యాణానికి హాజరైన భక్తులు

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 17 : జగదభిరాముడు శ్రీరామచంద్రుడు.. సీతాదేవిల కమనీయ కల్యాణ ఘట్టం బుధవారం చైత్రశుద్ధ నవమి పునర్వసు నక్షత్రంతో కర్కాటక లగ్నంలో ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమై అభిజిత్ లగ్న సుముహూర్తాన 12 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా నేత్రపర్వంగా కొనసాగింది. చూచువారలకు చూడముచ్చటగా రాములోరి పెళ్లి వేడుకలు కనువిందు చేశాయి. జిల్లాలోని డివిజన్ కేంద్రాలు, మండలాల్లో సీతారాముల కల్యాణోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. సీతారాముల ఆలయాలు, ఆంజనేయస్వామి, వెంకటేశ్వర స్వామి, శివాలయాలు, సాయిబాబా దేవాలయాలు, అమ్మవారి ఆలయాల్లో సీతారాముల కల్యాణ తంతును వేదమంత్రోచ్ఛరణల నడుమ కమనీయంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరాగా, రామనామం మార్మోగింది. అనంతరం మహా అన్నప్రసాద వితరణ గావించారు.

కమనీయంగా వేడుకలు..

వరంగల్ నగరంలోని ఆలయాలు, వివిధ ప్రాంతాల్లో శ్రీసీతారాముల కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. గీతా భవన్‌లోని కృష్ణాలయం, దాసాంజనేయ ఆలయం, శ్రీగోవిందరాజుల గుట్టపై, స్టేషన్ రోడ్డులోని మార్వాడీ ఆలయం, రామన్నపేటలోని శ్రీరామలింగేశ్వరాలయం శ్రీసీతారామ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో, వాసవీ మాత దేవాలయం, బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ చౌరస్తాలో, ఎల్లంబజార్‌లోని శ్రీసీతారామ ఆలయం, దుర్గేశ్వరాలయం, భోగేశ్వరాలయం, శ్రీకాశీవిశ్వేశ్వరాలయం, రంగంపేట శివాలయం, శివనగర్‌లోని రామాలయంలో కల్యాణోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. అలాగే రంగశాయిపేటలోని శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయం, ఓసిటీలోని ఆంజనేయస్వామి ఆలయం, కాశిబుగ్గలోని శ్రీరంగనాథ దేవాలయం, ఎంజీఎం సెంటర్‌లోని శ్రీరాజరాజేశ్వరి మాత ఆలయం, మట్టెవాడలోని వేణుగోపాలస్వామి దేవాలయంలో, బట్టల బజార్‌లోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం, శ్రీనివాస కాలనీలోని శ్రీ శృంగేరి మఠంలో, షిర్డీ సాయిబాబా దేవాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగాయి.

చారిత్రక భద్రకాళి అమ్మవారి దేవాలయంలో సీతారాముల కల్యాణ వేడుకలు వేద మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించారు. ములుగు రోడ్డులోని శ్రీవరద దత్తక్షేత్రంలో కల్యాణోత్సవం భక్తుల రామ నామ స్మరణ మధ్య వైభవంగా జరిగింది. అలాగే నర్సంపేట, వర్ధన్నపేట పట్టణాలు, ఖానాపూర్, చెన్నారావుపేట, నెక్కొండ, గీసుగొండ, సంగెం, పర్వతగిరి, రాయపర్తి, నల్లబెల్లి, దుగ్గొండి, ఖిలా వరంగల్ మండలాల్లో ఊరూరా సీతారాముల కల్యాణోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఊకల్‌లోని శ్రీబాల నాగసుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో సముద్రాల సుదర్శనాచార్యుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. అయోధ్యలో శ్రీబాలరాముడి ప్రతిష్ఠ జరిగిన అనంతరం మొదటి సారిగా శ్రీరామ నవమి రావడంతో సీతారాముల కల్యాణోత్సవ వేడుకలను భక్తులు కడు రమణీయంగా జరుపుకున్నారు. వేడుకలకు పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. కాగా, సీతారాముల కల్యాణోత్సవ వేడుకలకు ఎన్నికల కోడ్ ఉండటంతో ప్రముఖులు హాజరు కాలేదు.

నామినేషన్ల స్వీకరణకు వేళాయే..



వరంగల్ కలెక్టరేట్‌లో నామినేషన్ల స్వీకరణపై ట్రయల్ నిర్వహిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

లోక్‌సభ ఎన్నికలకు కౌంట్‌డౌన్ మొదలైంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల నామినేషన్లను గురువారం నుంచి స్వీకరించనున్నారు. ఇందు కోసం ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా ఉన్న వరంగల్, మహబూబాబాద్ జిల్లా కలెక్టర్లు నామినేషన్లు స్వీకరించేందుకు కలెక్టరేట్‌లలో విస్తృత ఏర్పాట్లు చేశారు. గురువారం నుంచి ఈనెల 25వ తేదీవరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. మే 13న రెండు లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరుగనుంది. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఇప్పటికే అధికారులు ఓటరు జాబితాను సిద్ధం చేశారు. మరోవైపు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారు కావటంతో ఓట్ల కోసం ప్రజాక్షేత్రంలో మండుటెండను లెక్క చేయకుండా ప్రచారపర్వంలో చెమటోడ్చుతున్నారు.

నేటి నుంచి నామినేషన్లు స్వీకరణ

దేశవ్యాప్తంగా జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా 4వ దశలో తెలంగాణలో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాలకు మార్చి 16న కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. గురువారం నుంచి నామినేషన్లను స్వీకరించేందుకు వరంగల్, మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. ఈనెల 25వ తేదీ వరకు నామినేషన్లకు గడువు ఇచ్చారు. 26వ తేదీన వచ్చిన నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి సమక్షంలో పరిశీలన చేయనున్నారు. 27 శనివారం, 28 ఆదివారం కావటంతో రెండు రోజులు సెలవులు. 29వ తేదీన ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాతో పాటు ఎన్నికల గుర్తులను కూడా కేటాయించనున్నారు. మే 13వ తేదీన రెండు లోక్‌సభ పరిధిలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి విజేతలను ప్రకటించనున్నారు.

విస్తృత ఏర్పాట్లు

నామినేషన్ పత్రాలు దాఖలు చేసేందుకు కలెక్టరేట్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వద్దకు అభ్యర్థితో పాటు మరో ఐదుగురికి మాత్రమే అవకాశం ఉంటుంది. ఒక్క అభ్యర్థి నాలుగు సెట్లలో నామినేషన్ దాఖలు చేసే అవకాశం ఉంది. 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకే నామినేషన్లు స్వీకరిస్తారు. మధ్యాహ్నం 3గంటల తరువాత వచ్చే నామినేషన్లను స్వీకరించరని వరంగల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.ప్రావీణ్య తెలిపారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో ఓటరుకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా దృష్టిసారిస్తున్నారు. ముఖ్యంగా దివ్యాంగులు, గర్భిణులు సులువుగా పోలింగ్ కేంద్రాలకు వచ్చేందుకు ఏర్పాట్లు చేసున్నారు. ఓటరు ఫెలిసిటేషన్ సెంటర్, హెల్ప్ డెస్క్, సిగ్నేజ్, షెడ్, తగిన లైటింగ్ సౌకర్యం ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

- నేటి నుంచి లోక్‌సభ స్థానాలకు నామినేషన్లు
- ఈ నెల 25వ తేదీ వరకు స్వీకరణ
- 26న పరిశీలన, 29న ఉపసంహరణలకు గడువు
- మే 13న మహబూబాబాద్, వరంగల్ ఎంపీ స్థానాలకు ఎన్నికలు
- జూన్ 4న ఓట్ల లెక్కింపు
- రెండు జిల్లాల్లో విస్తృత ఏర్పాట్లు
- ఖరారైన ప్రధాన పార్టీల అభ్యర్థులు
- ప్రచార పర్వంలోకి ప్రధాన పార్టీలు

అధికారులు సిద్ధం

ఎన్నికలు సజావుగా జరిగేందుకు పోలీసు యంత్రాంగం విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టింది. నగదు రవాణా, మద్యం అమ్మకాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. వరంగల్, మహబూబాబాద్ కలెక్టరేట్‌ల వద్ద 144సెక్షన్ అమలు చేయనున్నారు. మరోవైపు మండుటెండలను సైతం లెక్క చేయకుండా అభ్యర్థులు ప్రజాక్షేత్రంలో ఓట్ల వేటకు దిగుతున్నారు. కీలక నేతలను కలుసుకోవటంతో పాటు బూత్‌స్థాయి సమావేశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. మొత్తానికి గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అవుతుండటంతో ఎన్నికల ప్రచారం మరింతగా హీటెక్కనుంది.

అభ్యర్థులు సై..

లోక్‌సభ ఎన్నికల నామినేషన్లకు అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. మహబూబాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్ ఈనెల 19వ తేదీన నామినేషన్ వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బలరాంనాయక్ నామినేషన్ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. అలాగే 21 లేదా 22వ తేదీన బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేదా మాజీ మంత్రి హరీశ్‌రావు కవిత నామినేషన్ ప్రక్రియలో పాల్గొనే అవకాశం ఉన్నట్లు గులాబీ నేతలు పేర్కొంటున్నారు. అలాగే బీజేపీ అభ్యర్థి సీతారాంనాయక్ నామినేషన్ సందర్భంగా బీజేపీ సీనియర్ నేత డాక్టర్ లక్ష్మణ్ వచ్చే అవకాశం ఉందని సమాచారం. అలాగే వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య మొదటి సెట్ 22వ తేదీన దాఖలు చేస్తుండగా, 24వ తేదీన మరో సెట్ నామినేషన్ వేయనున్నారు. 24వ తేదీన కావ్య నామినేషన్ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ సందర్భంగా మడికొండలో బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నారు. అలాగే బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ 24వ తేదీన నామినేషన్ వేయనున్నారు. అరూరి రమేష్ నామినేషన్ ఘట్టానికి బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై వచ్చే అవకాశం ఉంది. బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్ కుమార్ 22వ తేదీన నామినేషన్లు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



ఓటర్ల లెక్క ఇదీ..!

- వరంగల్‌లో 18,16,543 మంది ఓటర్లు
- మహబూబాబాద్‌లో 15,30,367 ఓటర్లు
- ఓటరు జాబితాను సిద్ధం చేసిన అధికారులు

అభ్యర్థుల అఫిడవిట్ పారదర్శకంగా ఆన్‌లైన్ చేయాలి

- వీసీలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 17: లోక్‌సభ ఎన్నికల్లో ఓటరు స్లిప్పులు ప్రతి ఓటరుకు చేరేలా చర్యలు తీసుకొని ముందస్తుగానే పంపిణీ చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. బుధవారం వికాస్‌రాజ్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి నామినేషన్ల ప్రక్రియ, ఓటరు తుది జాబితా రూపకల్పనపై జిల్లా ఎన్నికల అధికారులతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ నాటికి తుది ఓటరు జాబితా రూపొందించాలన్నారు. పోటీ చేసే అభ్యర్థులు వివిధ రాజకీయ పార్టీలు నియమించిన పోలింగ్ ఏజెంట్లు క్షేత్ర స్థాయిలో ఓటరు స్లిప్పుల పంపిణీ సమయంలో పాల్గొనవచ్చని, పంపిణీని పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పోటీ చేసే అభ్యర్థుల సహాయార్థం హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసి రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి సాధ్యమైనంత వరకు ప్రత్యేక ఎంట్రీ, ఎగ్జిట్ ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. నామినేషన్ ప్రక్రియ పూర్తి స్థాయిలో వీడియోగ్రఫీ, ఫొటోగ్రఫీ జరగాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రతిరోజు నివేదికలను అందజేయాలన్నారు. వీసీలో కలెక్టర్ పి.ప్రావీణ్య, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌వో పాల్గొన్నారు.

పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడిగా రమేష్



రాయపర్తి, ఏప్రిల్ 17 : తెలంగాణ పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని కేశవపురం జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న నాగబండి రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పర్వతి సత్యనారాయణ బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ తన పట్ల నమ్మకంతో అప్పగించిన అధ్యక్ష పదవికి న్యాయం చేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన జిల్లా,రాష్ట్ర స్థాయి కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

ఎన్నికల విధులు సమన్వయంతో నిర్వహించాలి

- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో లైవ్ వెబ్‌కాస్టింగ్ చేయాలి
- వరంగల్ లోక్‌సభ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 17 : లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల నోడల్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని వరంగల్ లోక్‌సభ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. బుధవారం వరంగల్ కలెక్టరేట్ నుంచి జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, వరంగల్, హనుమకొండ జిల్లాల అదనపు కలెక్టర్లు సంధ్యారాణి, రాధిక గుప్తాలతో కలిసి వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధి ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలోని అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వివిధ అంశాలపై సమీక్షించారు.

ఈ సందర్భంగా ప్రావీణ్య మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారం చేసే అభ్యర్థుల వాహనాల అనుమతులకు సువిధ యాప్ ద్వారా రిటర్నింగ్ అధికారి పరిధిలో మంజూరు చేయాలన్నారు. సభలు, సమావేశాలకు సంబంధిత అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు లేదా ఎన్నికల అధికారుల స్థాయిలో మంజూరు చేస్తూ ఎస్ఎస్‌టీలు సక్రమంగా విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో లైవ్ వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎన్నికల అంశాలపై నియమించిన అధికారులు సకాలంలో నిర్ణీత నమూనాలు, రోజువారి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ సెంట్రల్ అధికారులను రిజర్వుగా ఉంచుకోవాలని రిటర్నింగ్ అధికారి ప్రావీణ్య అన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు తక్షణమే పూర్తి చేసి, ప్రతీ పోలింగ్ కేంద్రంలో అధికారులు, సిబ్బంది బీఎల్‌వోల వివరాలు ప్రదర్శించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఫారం-12 స్వీకరణను ఎసెన్షియల్ సర్వీసెస్, 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు హోమ్ ఓటింగ్‌ను ఈ నెల 25వ తేదీ లోగా పూర్తి చేయాలని సూచించారు. గత ఎన్నికల ఆధారంగా ప్రతి పోలింగ్ స్టేషన్‌లో దివ్యాంగుల సౌకర్యార్థం అవసరమైన వీల్‌చైర్‌లతో పాటు వలంటీర్స్‌ను అందుబాటులో ఉంచుకోవాలని ప్రావీణ్య తెలిపారు.

కాన్ఫరెన్స్‌లో వరంగల్, హనుమకొండ డీఆర్‌వోలు శ్రీనివాస్, వైవి.గణేష్, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, పరకాల, వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, భూపాలపల్లి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు డీఎస్.వెంకన్న, రోహిత్ సింగ్, నారాయణ, వెంకటేశ్, సీదం దత్తు, మంగీలాల్, జిల్లా నోడల్ అధికారులు రామిరెడ్డి, సంజీవరెడ్డి, పుష్పలత, సౌజన్య, ఏవో శ్రీకాంత్, ఎన్నికల పర్యవేక్షకులు విశ్వనారాయణ, రమేశ్, చంద్రశేఖర్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

మళ్లీ హనుమకొండకే..

- నగరానికి ఇంటర్ ఆర్జేడీ కార్యాలయం తరలింపు
- హర్షం వ్యక్తం చేస్తున్న అధ్యాపకులు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 17 : ఇంటర్ విద్య ఆర్జేడీ కార్యాలయాన్ని హైదరాబాద్ ఇంటర్ కమిషనర్ కార్యాలయాన్ని హనుమకొండకు తరలిస్తూ వెంటనే చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఉన్నత విద్యశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో హనుమకొండ బస్టాండ్ ప్రాంతంలోని ఇంటర్ ఆర్జేడీ కార్యాలయం ఉండేది. అక్కడి నుంచి హనుమకొండ ప్రాంతంలోని ఎక్సైజ్‌కాలనీలోని ప్రైవేట్ భవనంలో ఉండేది. అయితే రాష్ట్ర ఇంటర్ కళాశాల కమిషనర్ ఉత్తర్వుల మేరకు హనుమకొండ నుంచి హైదరాబాద్‌లోని ఇంటర్ కమిషనరేట్ కార్యాలయానికి తరలించారు. అయితే ఇంటర్ విద్య సంఘాలు, ఇతర అధ్యాపక సంఘాల వేర్వేరు అభ్యర్థనల మేరకు ఇంటర్ విద్య ఆర్జేడీ కార్యాలయాన్ని హనుమకొండకు తరలిస్తూ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. మళ్లీ జోన్-1 పరిధిలోని ఇంటర్ కళాశాలల పర్యవేక్షణ, జూనియర్ కళాశాల అధ్యాపకుల పదోన్నతులు, ఇతరత్రా పనులు ఆర్జేడీ కార్యాలయం నుంచి నిర్వహిస్తారు. హైదరాబాద్ నుంచి హనుమకొండకు ఇంటర్ ఆర్జేడీ కార్యాలయాన్ని తరలించడంపై అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి


- జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీసీవో సంజీవరెడ్డి

పర్వతగిరి, ఏప్రిల్ 17 : రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లను వెనువెంటనే చేపట్టాలని జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి అన్నారు. పర్వతగిరి మండల కేంద్రంతో పాటు చౌటపెల్లి, నారాయణపురం, రోళ్లకల్లు గ్రామాల్లో ఐకేపీ, సొసైటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం సందర్శించారు. కేంద్రాల్లో ప్యాడీ క్లీనర్, మాచర్ మిషన్, టార్పాలిన్‌లు, కాంటాలు, రికార్డులను తనిఖీ చేశారు. కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. తేమ శాతం 18 ఉన్నా కాంటాలు నిర్వహించి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని, ఎప్పటికప్పుడు మిల్లుల నుంచి ట్రక్ షీట్లను తెప్పించుకుని రైతుల వివరాలను ట్యాబ్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. రైతులు తమ ధాన్యాన్ని ప్యాడీ క్లీనర్‌లో శుద్ధి చేయించిన తరువాతనే కాంటాలు పెట్టాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీఎం కృష్ణమూర్తి, సీసీలు కాంతయ్య, రమాదేవి, సుధాకర్, రవీందర్‌రాజు, వీవోఏలు కరుణ, రజిత, అరుణ తదితరులు పాల్గొన్నారు.

బుధవారం ఉష్ణోగ్రత	గరిష్ఠం : 42.0°C	కనిష్ఠం : 25.5°C



28 నుంచి దూరవిద్య డిగ్రీ మొదటి సెమిస్టర్ తరగతులు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 17: ఈనెల 28 నుంచి కేయూ దూరవిద్య కేంద్రం డిగ్రీ కోర్సుల మొదటి సెమిస్టర్ కాంట్రాక్టు తరగతులు నిర్వహిస్తామని కేయూ దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 28 మే 5, 11, 12, 19,26, 27, 28, 29, 30 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు నిర్వహిస్తామని వెల్లడించారు. కేయూ పరిధిలోని దూరవిద్య కేంద్రంలో స్టడీ సెంటర్లలో తరగతులు జరుగుతాయని తెలిపారు.

హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిర్మల్ పంచశీల కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్, జనగామ ఆర్ఆర్ఎం కాలేజీ, ఎస్ఆర్ఆర్ కాలేజీ, కౌటలా శ్రీ చైతన్య డిగ్రీ కాలేజీ శ్రీఆరంపూర్, స్వాతి డిగ్రీ కళాశాల లక్సెట్టిపేట, వైష్ణవి ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో తరగతులు జరుగుతాయని వెల్లడించారు. అభ్యర్థులు తరగతులకు హాజరుకావాలని డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం సూచించారు.

రైలులో గుర్తుతెలియని మృతదేహం లభ్యం


గుర్తు తెలియని మృతదేహం

కాజీపేట, ఏప్రిల్ 17: కాజీపేట రైల్వేస్టేషన్‌లో రామగిరి రైలులో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. కాజీపేట రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్-2లో రామగిరి రైలులో మంగళవారం ఓగుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. మృతుడి వయస్సు 55 - 60 యేళ్ల ఉంటుందని, తెల్ల గడ్డం, 5.4 ఎత్తు బ్లూషర్ట్‌పై వైట్‌లైన్స్, నీలం రంగు లుంగీ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. మృతుడిని గుర్తించడానికి ఎలాంటి ఆనవాళ్లు లేవు. రైల్వే ఉద్యోగుల సమాచారం మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపర్చామని, ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే పోలీస్ స్టేషన్ ఫోన్‌నంబర్ 87126 58609, 99498 59108కు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు తెలిపారు.

యువతి అదృశ్యం

హనుమకొండ టౌన్, ఏప్రిల్17: అమృత థియేటర్ సమీపంలోని గుడిబండల్ ప్రాంతానికి చెందిన తన బిడ్డ అదృశ్యమైందని తండ్రి హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ రోడ్డులోని ఓ ప్రైవేట్ యూనివర్శిటీలో ఎంబీఏ చదువుతున్న యువతి(23) బుధవారం మధ్యాహ్నం కిరాణం షాపునకు వెళ్తున్నానని చెప్పి తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా సమాచారం దొరకలేదు. చింతగట్టు క్యాంపునకు చెందిన ఓ యువకుడిపై అనుమానం ఉందని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేసవి క్రికెట్ శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి..

డబ్ల్యూడీసీఏ ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్17: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ (డబ్ల్యూడీసీఏ) ఆధ్వర్యంలో ఏప్రిల్ 20 నుంచి మే 20వ తేదీ వరకు నెల పాటు నిర్వహించనున్న వేసవి ఉచిత క్రికెట్ శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ (డబ్ల్యూడీసీఏ) ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం వరంగల్ మండిబజార్‌లోని డబ్ల్యూడీసీఏ కార్యాలయంలో డబ్ల్యూడీసీఏ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈసీ సమావేశంలో చాగంటి శ్రీనివాస్ పాల్గొని వేసవి క్రికెట్ శిక్షణా శిబిరాల వివరాలను వెల్లడించారు. ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా వరంగల్, పరకాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ 5 సెంటర్లను ఎంపిక చేయగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే క్రీడాకారులకు గురువారంతో గడువు ముగియనున్నట్లు ఆయన తెలిపారు.

అండర్-14, 16, 19, 23 బాల బాలికలకు నిష్ణాతులైన కోచ్‌ల పర్యవేక్షణలో రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ అందిసామన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో నెల రోజుల పాటు నిర్వహించనున్న వేసవి క్రికెట్ శిక్షణా శిబిరాల ప్రతీ సెంటర్‌లో పాల్గొనే క్రీడాకారులకు జంబో క్రికెట్ కిట్, మ్యాట్, బ్యాక్‌నెట్, గ్రేస్‌బాల్స్, టెన్నిస్‌బాల్స్‌తో పాటు శిబిరంలో పాల్గొనే ప్రతీ ఒక్క క్రీడాకారుడికి పౌష్టికాహారంగా కోడిగుడ్డు, అరటి పండ్లను ఉచితంగా అందిస్తామన్నారు. అదే విధంగా శిబిరాలలో కోచింగ్ ఇవ్వనున్న కోచ్‌లకు రూ.15వేలు, గ్రౌండ్ మెన్లకు రూ.10వేల చొప్పున గౌరవ వేతనం అందించాలని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అసోసియేషన్ పాలకవర్గం ఏకగ్రీవ తీర్మానాన్ని చేసిందన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలలో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని శ్రీనివాస్ సూచించారు.

నేటితో ముగియనున్న స్వీకరణ

హెచ్‌సీఏ ఆదేశాల మేరకు డబ్ల్యూడీసీఏ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న ఉచిత వేసవి క్రికెట్ శిక్షణా శిబిరాల ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ గురువారంతో ముగియనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్‌లో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు తమ పేర్లను టీటీటీ.జీయిటజీచిజ్జ్యూ.గౌటజ వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికే శిక్షణ శిబిరంలో పాల్గొనే అవకాశం ఉంటుందని, శిక్షణా శిబిరానికి ఎంపికైన క్రీడాకారులు వైట్ యూనిఫామ్‌తో రావాలని కోరారు. శిక్షణా శిబిరంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు మే నెల చివరి వారంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి టీడీఎల్ - 2024 టోర్నమెంట్‌కు ఎంపిక చేయడమే కాకుండా హెచ్‌సీఏ అకాడమీకి ఎంపిక చేస్తామన్నారు.

ఐదు జిల్లా కేంద్రాల్లో శిక్షణ

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఐదు జిల్లా కేంద్రాలలోని క్రీడా మైదానాలలో శిక్షణా శిబిరాలను ఎంపిక చేశారు. వరంగల్ ఎల్బీ కళాశాల క్రీడా మైదానం కోచ్‌లు గోవిందసింగ్, బి.వేణు, మహిళా కోచ్ ఝాన్సీ సెల్ నెంబర్ 9849570979, పరకాల జూనియర్ కళాశాల క్రీడా మైదానం కోచ్‌లు బొజ్జం అరుణ్ సెల్ 9666206662, జయశంకర్ భూపాలపల్లి, సింగరేణి క్రీడా మైదానం కోచ్‌లు కర్నాకర్, రాజ్‌కుమార్ సెల్ 8897805683, ములుగు తంగేడు క్రీడా మైదానంలో కోచ్‌లు మట్టెడ కుమార్, సందీప్‌నేత్ర సెల్ 9030130727, మహబూబాబాద్ సిద్దార్థ హైస్కూల్ క్రీడా మైదానం కోచ్‌లు కుమార్, వినయ్ సెల్ 9866479666 నెంబర్‌లలో కోచ్‌లు అందుబాటులో ఉంటారు. ఈ సమావేశంలో డబ్ల్యూడీసీఏ జిల్లా అధ్యక్షుడు పెద్ది ప్రవీణ్‌గౌడ్, ఉపాధ్యక్షులు నజీమ్, రాముఠాం, ఖాజా, కార్యవర్గ సభ్యులు అభినవ్‌వినయ్, మటెడ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అఫిడవిట్‌లో తప్పులుంటే ఆగమే..

- అభ్యర్థులు నేర సమాచారాన్ని తప్పనిసరిగా సమర్పించాల్సిందే
- ఆస్తులు, అప్పులను చెప్పాల్సిందే..
- అన్ని కాలమ్స్ నింపాల్సిందే

వరంగల్‌సిటీ, ఏప్రిల్ 17: లోక్‌సభ ఎన్నికలకు గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండగా.. అభ్యర్థులు నామపత్రాలతో పాటు సమర్పించే అఫిడవిట్ పత్రాలు కీలకంగా మారుతాయి. అభ్యర్థులు తమ వివరాలతో పాటు ఆస్తులు, అప్పులు ప్రమాణరూపంలో ముందే స్పష్టం చేయాలి. గతంలో ఏమైనా కేసులున్నా.. శిక్ష పడినా.. వాటిని పొందుపరుచాలి. వీటన్నింటిని కలిపి దాఖలు చేసే అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇస్తే మాత్రం అదే ప్రత్యర్థులకు ఆయుధమై కోర్టు కేసుల వరకు వెళ్లడమే కాకుండా అనర్హత వేటుకు దారి తీయవచ్చని న్యాయ నిపుణులు అంటున్నారు. ఉదాహరణకు 2023లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వర్‌రావుపై హైకోర్టు అనర్హత వేటు వేసింది. 2018 ఎన్నికల సమయంలో తప్పుడు అఫిడవిట్‌ను సమర్పించినట్లు నిర్ధారించి, ఎమ్మెల్యేగా వనమా ఎన్నిక చెల్లదని కోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పుపై వనమా సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

నేర సమాచారం చెప్పాల్సిందే...

అభ్యర్థి తనపై క్రిమినల్ కేసులు నమోదై ఉంటే వాటిని అఫిడవిట్‌లో పొందుపరచాలి. న్యాయస్థానాలు గతంలో శిక్ష విధించినా, అప్పీలుకు వెళ్లినా వాటి సమాచారాన్ని, సామాజిక మాధ్యమాల ఖాతాల వివరాలనూ తెలపాలి. అన్ని వివరాలతో కూడిన అఫిడవిట్‌కు నోటరీ తప్పనిసరి. సాధారణంగా నామినేషన్ దాఖలు చేసే సమయంలో రిటర్నింగ్ అధికారి ముందు అభ్యర్థి ప్రమాణం చేస్తారు. వేరే ఎవరైన నామినేషన్ దాఖలు చేస్తే సదరు అభ్యర్థి తాను ఉన్న ప్రాంతంలో మెజిస్ట్రేట్ ముందు ప్రమాణం చేయాలి. అలాగే అభ్యర్థులు తమపై నమోదైన కేసుల వివరాలు ప్రముఖ దినపత్రికల్లో స్పష్టంగా కనిపించేలా ప్రకటనలివ్వాలి.

ఆస్తులు, అప్పులు వెల్లడించాలి..

స్థిర, చరాస్తులతో పాటు చేతిలో, ఖాతాల్లోని నగదు, డిపాజిట్లు, ఇతర సేవింగ్స్‌ను, బీమా పాలసీలను, అప్పులు తదితర సమాచారాన్ని పొందు పర్చాలి. ఆభరణాలు, వాహనాలు, వ్యవసాయ భూములు, వాణిజ్య సముదాయాలు, నివాస స్థలాల వంటి వాటిని అఫిడవిట్‌లో పొందుపరుచాలి. అవి వారసత్వంగా వచ్చాయా.. కొనుగోలు చేశారా అన్నది పేర్కొనాలి. స్థిరాస్తికి సంబంధించిన ప్రస్తుత మార్కెట్ విలువను వెల్లడించాలి.అభ్యర్థి తోపాటు కుటుంబ సభ్యుల పేరిట రుణాలు ఉంటే వాటి వివరాలు ప్రస్తావించాలి. కుటుంబ సభ్యుల ఆదాయమార్గాలు, ప్రభుత్వ లేదా ప్రైవేటు కంపనీల కాంట్రాక్టులు ఉంటే వాటిని తెలుపాలి.

అభ్యర్థి వివరాలు తెలుసుకోవడం హక్కు

ప్రజాప్రతినిధిగా ఎన్నుకోబోయే అభ్యర్థికి సంబంధించిన అన్ని వివరాలను తెలుసుకోవడం ఓటరు హక్కు. అప్పుడే అభ్యర్థులపై స్పష్టత వస్తుంది. ఇదే విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అందులో భాగంగానే అభ్యర్థులు తమ నామినేషన్‌తోపాటు అఫిడవిట్‌ను దాఖలు చేయాల్సి ఉంటుంది. ఎన్నికల నిబంధనలకు లోబడి ఫాం-26 రూపంలో అభ్యర్థులు అఫిడవిట్‌ను సమర్పించాలి.

అన్ని కాలమ్స్‌ను పూర్తి చేయాలి

అఫిడవిట్‌లోని ఏ ఒక్క కాలమ్ ఖాళీగా వదలవద్దని ఈసీ స్పష్టం చేసింది. అభ్యర్థులకు సంబంధం లేకపోతే ఆ కాలమ్‌లో నిల్ లేదా వర్తించదు అని రాయాలని తెలిపింది. అభ్యర్థి సమర్పించిన అఫిడవిట్‌ను గమనించి ఏదైనా సమాచారం లేకపోతే రిటర్నింగ్ అధికారి నోటీస్ ఇస్తారు. అప్పుడు సవరించిన అఫడవిట్‌ను అభ్యర్థి అందించాలి. అయినా పూర్తిస్థాయి వివరాలతో అఫిడవిట్ లేకపోతే పరిశీలన (స్క్రూటినీ) సమయంలో నామినేషన్ తిరస్కరణకు గురవుతుంది. అభ్యర్థులు దాఖలు చేసిన అఫిడవిట్లను రిటర్నింగ్ అధికారి నోటీస్ బోర్డులపై, వెబ్‌సైట్లలో పొందుపరుస్తారు.



ఫాం-26 నిబంధనలకు లోబడి ఉండాలి



తీగల జీవన్‌గౌడ్, న్యాయవాది

అభ్యర్థులు ఫాం-26 ద్వారా అఫిడవిట్‌ను ఎన్నికల నిబంధనలకు లోబడి సమర్పించాల్సి ఉంటుంది. ఆస్తులు, అప్పులు, నేర వివరాల్లో కచ్చితత్వం ఉండాలి. తప్పుడు సమాచారం ఇస్తే న్యాయ పరమైన చిక్కులు ఎదుర్కోక తప్పదు.

ఓటర్ల లెక్క ఇదీ..

- వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో 18,16,543 మంది ఓటర్లు
- మహబూబాబాద్‌లో 15,30,367 ఓటర్లు
- జాబితా సిద్ధం చేసిన అధికారులు

వరంగల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాటు చేసింది. ఏప్రిల్ 15వ తేదీ వరకు కొత్తగా ఓటరు నమోదుకు అవకాశం కల్పించింది. అలాగే ఓటును ఇతర ప్రాంతాలకు మార్చుకునేందుకు కూడా అవకాశం ఇచ్చింది. దీంతో చాలా అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓట్లు తగ్గిపోయాయి. కొన్ని చోట్ల పెరిగాయి. మొత్తంగా నెల రోజుల ఓటరు డ్రైవ్‌లో వరంగల్ లోక్‌సభ స్థానం పరిధిలో కొత్తగా 114 ఓట్లు మాత్రమే పెరిగాయి. మహబూబాబాద్ పరిధిలో 3,369 ఓట్లు పెరిగాయి.

వరంగల్ లోక్‌సభ పరిధిలో వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, పరకాల, భూపాలపల్లి, వర్ధన్నపేట, పాలకుర్తి, స్టేషన్‌ఘనపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. కొత్త ఓటరు జాబితా ప్రకారం వరంగల్ లోక్‌సభ పరిధిలో మొత్తం 18,16,543మంది ఓటర్లుండగా, వీరిలో పురుషులు 8,91,940 మంది, మహిళలు 9,24,208 మంది, ఇతరులు 395మంది ఓటర్లు ఉన్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1,892 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అత్యధికంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 2,81,874 మంది ఓటర్లు ఉండగా, భూపాలపల్లి నియోజకవర్గంలో 2,76,030 మంది, వర్ధన్నపేట నియోజకరవ్గంలో 2,72,724మంది ఓటర్లు ఉన్నారు. మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలో మహబూబాబాద్, డోర్నకల్, నర్సంపేట, ములుగుతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పినపాక, ఇల్లందు, భద్రాచలం నియోజకవర్గాలు ఉన్నాయి. మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలో మొత్తం 15,30,367 మంది ఓటర్లుండగా, పురుషులు 7,46,982 మంది, మహిళలు 7,83,280 మంది ఓటర్లు, ఇతరులు 105మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం 1,813 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. మహబూబాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో అత్యధికంగా 2,58,451మంది ఓటర్లుండగా, నర్సంపేట నియోజకవర్గంలో 2,35,447 మంది, ములుగు నియోజకవర్గంలో 2,32,791 మంది ఓటర్లు ఉన్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1,813 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

వరంగల్ లోక్‌సభ పరిధిలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓట్లు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	పోలింగ్ స్టేషన్
స్టేషన్‌ఘనపూర్	1,24,769	1,28,282	02	2,53,053	290
పాలకుర్తి	1,25,952	1,28,496	13	2,54,461	294
పరకాల	1,07,752	1,13,865	02	2,21,619	239
వరంగల్ పశ్చిమ	1,38,607	1,43,251	16	2,81,874	244
వరంగల్ తూర్పు	1,24,809	1,31,634	339	2,56,782	230
వర్ధన్నపేట	1,33,778	1,38,929	17	2,72,724	278
భూపాలపల్లి	1,36,273	1,39,751	06	2,76,030	317
మొత్తం	8,91,940	9,24,208	395	18,16,543	1,892

మానుకోట లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలో ఓటర్లు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	పోలింగ్ స్టేషన్
డోర్నకల్	1,09,150	1,13,455	07	2,22,612	264
మహబూబాబాద్	1,26,611	1,31,794	46	2,58,451	287
నర్సంపేట	1,15,068	1,20,370	09	2,35,447	283
ములుగు	1,13,592	1,19,172	27	2,32,791	307
పినపాక	99,824	1,03,798	05	2,03,627	250
ఇల్లందు	1,09,812	1,15,094	04	2,24,910	242
భద్రాచలం	72,925	79,597	07	1,52,529	180
మొత్తం	7,46,982	7,83,280	105	15,30,367	1,813

నెలరోజుల్లో స్వల్పంగా పెరిగిన ఓటర్లు..

లోక్‌సభ స్థానం	మార్చి 16 (2014)	ఏప్రిల్ 16(2024)	పెరిగిన ఓట్లు
వరంగల్	18,16,429	18,16,543	114
మహబూబాబాద్	15,26,998	15,30,367	3,369



పులకించిన భద్రగిరి

కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక

భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యుటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది. -భద్రాచలం



జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం



కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



స్వామివారి ఊరేగింపు



ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు



గౌతమీ నదిలో పుణ్య స్నానాలు





అగ్ని ప్రమాదాల నివారణకు పరికరాలే కీలకం

మట్టెవాడ, ఏప్రిల్ 17 : అగ్నిమాపక పరికరాల నిర్వహణే అగ్ని ప్రమాదాల నివారణలో కీలకమని వరంగల్ అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జ్ ఫైర్ ఆఫీసర్ బి.రవీందర్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా వరంగల్‌లోని నిర్మల ఆస్పత్రిలో బుధవారం అగ్నిప్రమాదాలు-నివారణ చర్యల గురించి ఆస్పత్రి సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. ఆస్పత్రిలో ఫైర్ స్మోక్ డిటెక్టర్లను అవసరమైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని అన్నారు. ఆటోమేటిక్ స్ప్రింక్లర్లను ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఎం.గణేశ్, టి.గంగాధర్, ఎమ్డీ.నబీ, కె.రవి, బి.గిరిబాబులు పాల్గొన్నారు.



ఆస్పత్రి సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా సహాయ కార్యదర్శిగా కుమార్



వరంగల్ సిటీ, ఏప్రిల్ 17 : నగరంలోని 14వ డివిజన్ ఏనుమాముల బాలాజీనగర్‌కు చెందిన పత్తి కుమార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా సహాయ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నగరగారి ప్రీతం ఆదేశానుసారం వరంగల్ జిల్లా అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు నియామక పత్రాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ చేతుల మీదుగా కుమార్ బుధవారం అందుకున్నారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన ప్రీతం, వెంకటయ్య, ఎర్రబెల్లి స్వర్ణ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్.నాగరాజులకు కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆదేశాలను తూచ తప్పకుండా క్షేత్ర స్థాయికి తీసుకెళ్లి కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

జిల్లాకు చేరుకున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 17 : పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని వ్యయ పరిశీలకులు ధీరజ్‌సింగా బుధవారం రాత్రి హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌కు చేరుకున్నారు. ఎన్నికల సంఘంచే వరంగల్ పార్లమెంట్‌కు కేటాయించబడిన ధీరజ్‌సింగాను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి కె.శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించి స్వాగతం పలికారు. అనంతరం ఎన్నికల్లో వ్యయ లెక్కింపునకు ఏర్పాటు చేసిన కమిటీలు, బృందాలు, వాటి పనితీరును ఆయనకు వివరించారు. ఇప్పటి వరకు స్వాధీనం చేసుకున్న, అప్పగించిన నగదు, మద్యం గురించి ఆయనకు డీఆర్వో తెలిపారు. స్వాగతం పలికిన వారిలో వ్యయ నోడల్ అధికారి, జడ్పీ సీఈవో రాంరెడ్డి, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, ఏవో శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

నామినేషన్ స్వీకరణలో పొరపాట్లు జరగొద్దు

▸▸ వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 17: నామినేషన్ల స్వీకరణలో సిబ్బంది జాగ్రత్తగా విధులు నిర్వహిస్తూ ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ప్రక్రియను పూర్తి చేయాలని వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలోనిర్వహించిన మాక్(ట్రయల్) నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు సమర్పించే బ్యాంకు ఖాతా, ఫొటోగ్రఫీ తదితర అంశాలపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. నామినేషన్లపై సిబ్బందికి సంపూర్ణ అవగాహన ఉండాలన్నారు. కలెక్టరేట్‌లోని హెల్ప్‌డెస్క్‌ను పరిశీలించి ప్రతిరోజు ఎన్నికల సంఘానికి నివేదికలను నిశితంగా పరిశీలించి పంపాలన్నారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్వో శ్రీనివాస్, ఏవో శ్రీకాంత్, తహసీల్దార్ ఇక్బాల్, విజయ్‌సాగర్, డీటీ పాల్గొన్నారు.

హెల్ప్ డెస్క్ ఏర్పాటు

లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కానుండటంతో అభ్యర్థుల సౌకర్యార్థం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నామినేషన్ హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. అభ్యర్థులు దరఖాస్తు నింపే సమయంలో తలెత్తే సమస్యలను ఈ హెల్ప్ డెస్క్‌లో నివృత్తి చేయనున్నారు. ఎలాంటి తప్పులు దొర్లకుండా దరఖాస్తు నింపడంలో హెల్ప్‌డెస్క్ సిబ్బంది అభ్యర్థులకు సహకరిస్తారని చెప్పారు.

నేత్రపర్వంగా సీతారాముల కల్యాణోత్సవం

▸▸ ఆలయాల్లో వైభవంగా కొనసాగిన వేడుకలు

▸▸ భారీగా వచ్చిన భక్తులు.. మార్మోగిన రామ నామం

కరీమాబాద్, ఏప్రిల్ 17 : వరంగల్ రంగశాయిపేటలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో బుధవారం శ్రీరామ నవమి వేడుకలు నేత్ర పర్వంగా జరిగాయి. ప్రధాన పూజారి తిరుమల శ్రీధరాచార్యులు, గ్రామ పురోహితులు వెలిదె నర్సింహమూర్తి శర్మ, వెలిదె ప్రదీప్‌శాస్త్రిల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ వేడుకలను వేదమంత్రోచ్చరణల మధ్య నిర్వహించారు. ఈ వేడుకలకు ఆలయ ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. భక్తుల శ్రీరామ నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఈ వేడుకల్లో ఆలయ ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ పులిగిల్ల వెంకటరామనర్సింహ శాస్త్రి, ధర్మకర్తలు వద్దిరాజు రంగరావు, శ్యాంసుందర్‌రావు, లక్ష్మీకాంతరావు, కొడిపాక మార్కండేయ తదితరులు పాల్గొన్నారు. శ్రీరామ సేవా సమితి ఆధ్వర్యంలో మహా అన్నదానం చేశారు. అలాగే రామాలయంలో నిర్వహించిన వేడుకలకు మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్, మేయర్ గుండు సుధారాణి-ప్రభాకర్ దంపతులు హాజరై సీతారాములను దర్శించుకున్నారు. స్థానిక 42వడివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్, పోశాల పద్మస్వామి, మరుపల్ల రవి, కొల్లూరి స్వరూప యోగానంద్, పీఎసీఎస్ చైర్మన్ కేడల జనార్దన్, మాజీ కార్పొరేటర్ కేడల పద్మ, కొంతం మోహన్, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ వలుపదాసు కృష్ణ, బొలుగొడ్డు అనిల్, ఆలయ ఈవో వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

● అండర్ రైల్వేగేటు ప్రాంతంలోని ఉర్సు, కరీమాబాద్, ఎస్ఆర్ఆర్ తోట, శంభునిపేట, విశ్వనాథ్‌కాలనీ, గణేష్‌నగర్ కాలనీల్లో బుధవారం శ్రీసీతారాముల కల్యాణ వేడుకలు వైభవంగా జరిగాయి. ఉర్సు అభయాంజనేయస్వామి దేవాలయం, కరీమాబాద్ బీరన్న దేవాయం, కాశీవిశ్వేశ్వరస్వామి (బొమ్మలగుడి), శ్రీసీతారామస్వామి మానసాదేవి సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి(రామస్వామి) దేవాలయం, శంభునిపేటలోని కార్యసిద్ధి హనుమాన్ దేవాలయంలో హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీరామ నవమి వేడుకలు జరిగాయి. విశ్వనాథ్‌కాలనీలోని శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయంలో నిర్వహించిన శ్రీసీతారాముల కల్యాణ వేడుకలకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, నగర మేయర్ గుండు సుధారాణి, స్థానిక కార్పొరేటర్ పోశాల పద్మ జనార్దన్‌లు హాజరయ్యారు.

● శంభునిపేటలోని జీఎంఆర్ గోకులం అపార్ట్‌మెంట్స్‌లో బుధవారం శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ఏర్పాట్లు చేసి సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో అపార్ట్‌మెంట్ సభ్యులు ఆకుల శ్రీనివాస్, రామోజు మనోహర్, శ్రవణ్‌కుమార్, దిలీప్, వెంకటరత్నం, ప్రదీప్, ప్రవీణ్‌కుమార్, రవీందర్, సంపత్, సురేంద్రబాబు, ప్రభాకర్ నాయుడు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు మహాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

● రంగశాయిపేట రామాలయంలో శ్రీసీతారాముల కల్యాణ వేడుకలకు శ్రీ శాలివాహన కుమ్మర డెవలప్‌మెంట్ అండర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు బుధవారం పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు, సమర్పించారు. ఆలయ ధర్మకర్త పులిగిల్ల వెంకటరామనర్సింహ శాస్త్రికి కల్యాణ మండపం వద్ద పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అప్పగించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఆవునూరి రవి, ప్రధాన కార్యదర్శి కందికొండ మోహన్, ఉపాధ్యక్షుడు ఆవునూరి కుమార్, కోశాధికారి కుమారస్వామి, రాంబాబు, ఆవునూరి లక్ష్మీ, క్రిష్ణ, శ్రీను, లింమూర్తి, కోటి, రాజు, మహేందర్, రమేష్, రాజేష్ పాల్గొన్నారు.

● మిల్స్‌కాలనీ : నగరంలోని 36వ డివిజన్ చింతల్ అభయాంజనేయ స్వామి దేవాలయంలో బీజేపీ నాయకుడు ఆడెపు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు పాల్గొన్నారు.

● గిర్మాజీపేట : నగరంలోని చారిత్రక గోవిందరాజస్వామి గుట్టపై సీతారాముల కల్యాణం కమనీయంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు వరయోగుల శ్రీనివాసస్వామి పర్యవేక్షణలో అర్చకులు వరయోగుల సాయి మనోజ్ స్వామి, లక్ష్మణస్వామి, క్రాంతిస్వామి, మురళిస్వామి, గోవిందస్వామి ఉదయం 10.30 గంటలకు సీతారాములకు విశేష పూజలు చేయడంతో కల్యాణోత్సవం ప్రారంభమైంది. 12.06 నిమిషాలకు అర్చకులు వేదమంత్రాలు, భక్తుల జైశ్రీరామ్ నామస్మరణ మధ్య మాంగళ్యధారణ గావించారు. స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్ స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో శ్రీగోవిందరాజస్వామి దేవాలయం కార్యనిర్వహణాధికారి వై.రత్నాకర్ రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, మాజీ కార్పొరేటర్ జారతి రమేష్, చింతాకుల సునీల్‌కుమార్, ఇప్ప ఆదినారాయణ పాల్గొన్నారు.

● పోచమ్మమైదాన్ : నగరంలోని మూడవ డివిజన్ పైడిపెల్లి శివాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవానికి స్థానిక కార్పొరేటర్ జన్ను షిభారాణి అనిల్ ముఖ్య అతిథిగాగా హాజరయ్యారు. ప్రత్యేక పూజలు చేసి సీతారాముల కల్యాణంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జన్ను అనిల్‌కుమార్, వీర భిక్షపతి, లింగం సంపత్, జన్ను రాజయ్య, కసివోజ్జల పూర్ణచంద్రాచారి, ముంజ వరద రాజు, ఇట్యాల సతీష్, మదూరి కైలాసం, ఆకుల రంజిత్ పాల్గొన్నారు. ఆరెపల్లిలోని రామాలయంలో కన్నుల పండుగగా సీతారాముల కల్యాణం జరిగింది. 23వ డివిజన్ ఆటోనగర్‌లోని శ్రీ శృంగేరీ శంకరమఠంలో శ్రీ సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు సంగమేశ్వరజోషి ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు మాజీ కార్పొరేటర్ వద్దిరాజు గణేష్, డాక్టర్ పోల నటరాజ్, పీవీకే శాస్త్రీ ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. 12వ డివిజన్‌లోని డాక్టర్స్ కాలనీ-2లో శ్రీ వరద వెంకటేశ్వరస్వామి ఆలయం, దేశాయిపేటలోని లక్ష్మీ మెగా టౌన్‌షిప్‌లో, శ్రీరంగనాథస్వామి ఆలయం, సాయిధామ్‌లోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో, బ్యాంకుకాలనీలో, పోచమ్మమైదాన్‌లోని హనుమాన్ దేవాలయంలో శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్లు బస్వరాజు కుమార్, శిరీష, శ్రీమాన్‌లు ముఖ్య అతిథులుగా హాజరై సీతారాముల కల్యాణ మహోత్సవం జరిపించారు.

● వరంగల్‌సిటీ : నగరంలోని 19వ డివిజన్ కాశిబుగ్గ ఓసిటీ రోడ్‌లోని శ్రీసీతారామాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీరామ నవమిని పురస్కరించుకుని శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం సుమారు 3వేల మందికి మహా అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, కాలనీ వాసులు, భక్తులు పాల్గొన్నారు. 20వ డివిజన్ కాశిబుగ్గ మార్కండేయ గుడిలో సీతారాముల కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, మాజీ కార్పొరేటర్ బయ్యా స్వామి తదితరులు హాజరై తలంబ్రాలు సమర్పించారు. 14వ డివిజన్ ఎన్‌టీఆర్ నగర్‌లోని శ్రీఅభయాంజనేయ స్వామి దేవాయంలో సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ముఖ్య అతిథులుగా వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ సులోచన సారయ్య, కాంగ్రెస్ నాయకుడు గోపాల నవీన్‌రాజ్, నందిని చిల్డ్రీస్ కంచ సదానందం పాల్గొని తలంబ్రాలను సమర్పించడంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. యువసేన యూత్ సభ్యులు, కాలనీ అభివృద్ధి కమిటీ పెద్దలు, గ్రామ పెద్దలు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

దయానందకాలనీ శ్రీకనుకదుర్గా మాతా దేవాలయంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మీసాల ప్రకాష్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వెంకటేశ్వర శర్మ నేతృత్వంలో సీతారామ కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నవీన్, సింగిరికొండ వెంకటేశ్వర్లు, సర్వారియా సురేష్, పప్పు వేణు, కొంక వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. 14వ డివిజన్ ఎస్ఆర్‌నగర్ శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయంలో శ్రీరామ నవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. అనంతరం మహా అన్నదానం చేశారు.

● ఖిలావరంగల్ : నగరంలోని శివనగర్ రామాలయం, ఖిలావరంగల్‌లోని స్వయంభూ దేవాలయం, పడమర, తూర్పు కోటలోని హనుమాన్ దేవాలయం, ఖమ్మంరోడ్ వద్ద గల శ్రీ శివశక్తి, వినాయక మందిర్, సాయిబాబా దేవాలయం, పుప్పాలగుట్టలోని ముత్యాలమ్మ దేవాలయం, లేబర్‌కాలనీలోని పంచముఖ నాగవీరేశ్వస్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు సీతారాముల మాంగళ్యధారణ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం అన్నదానం చేపట్టారు. సాయంత్రం స్థానిక కాలనీలలో సీతారాముల ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, దేవాలయ నిర్వాహకులు, ఒడ్నాల మల్లయ్య, మంచాల కృష్ణమూర్తి, మామిడాల రమేష్‌బాబు, లక్ష్మయ్య, మూడెడ్ల సతీష్, వేణు, ఎల్.శ్రీనివాస్, శామంతుల శ్రీనివాస్, సంగరబోయిన చందర్, అర్చకులు, శివశ్రీ భోగేశ్వరశాస్త్రి, ఎస్.శంభులింగం, భక్తులు పాల్గొన్నారు.

● మట్టెవాడ : వరంగల్ మట్టెవాడలోని శ్రీవేణుగోపాలస్వామి దేవాలయం, బట్టల బజార్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో, ఆర్ఎన్‌టీ రోడ్డులోని వరంగల్ బులియన్ మర్చెంట్స్ ఆధ్వర్యంలో సీతారాములు కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో వేణుగోపాలస్వామి దేవాలయం ప్రధాన అర్చకులు ఆరుట్ల నర్సింహచార్యులు, రామాచార్యులు, కృష్ణమాచార్యులు, బ్రహ్మోత్సవ కమిటీ అధ్యక్షుడు ఇరుకుళ్ల రమేశ్, మాజీ కార్పొరేటర్ తోట నవీన్‌కుమార్, కొత్త వెంకటకృష్ణ, ఆకుల రఘురాం, ఆకుల సర్వేశ్వర్‌రావు, ఆకుల రాజేశ్వరి, మహిళలు, భక్తులు పాల్గొన్నారు. వెంకటేశ్వరస్వామి దేవాలయంలో జరిగిన కల్యాణోత్సవంలో ఈవో వెలపాటి రత్నాకర్‌రెడ్డి, చైర్మన్ పరశరం శ్రీనివాసచార్యులు, అర్చకులు శ్రీధరాచార్యులు, సేవా సమితి సభ్యులు గందె గోవింద రాజులు, మహిళా మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. బులియన్ మర్చెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తోట హరీశ్, వ్యాపారస్తులు, భక్తులు పాల్గొన్నారు. ఎల్లంబజార్‌లోని సాయి సేవాదళ్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆరుట్ల శ్రీనివాస్, మోహనకృష్ణ, సేవాదళ్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

● గీసుగొండ : మండలంలో సీతారాముల కల్యాణోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆనంద్‌సా సోదరులు కుటుంబ సమేతంగా పాల్గొని సీతారాముల కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో జరిపించారు. గీసుగొండ శివాలయంలో కల్యాణోత్సవం అనంతరం మహా అన్నదానం నిర్వహించారు. మచ్చాపూర్‌లో భక్తాంజనేయస్వామి ఆలయంలో సీతారాములు కల్యాణోత్సవం నిర్వహించి ఉత్సవమూర్తులను డప్పు వాయిద్యాలతో ఊరేగించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రకాష్, నరేందర్ పాల్గొన్నారు. కొనాయిమాకులలోని ఆంజనేయస్వామి ఆలయం, మచ్చాపూర్‌లోని భక్తాంజనేయస్వామి ఆలయం, ధర్మారంలోని రామలింగేశ్వర ఆలయం, రెడ్డిపాలెంలోని సీతారాముల ఆలయాల్లో కల్యాణ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా రాములోరి తలంబ్రాలను, ప్రసాదాలను భక్తులకు అందచేశారు. కార్యక్రమంలో అర్చకులు అయ్యప్పశర్మ, లక్ష్మణ్, శ్రీనివాసమూర్తి, దీపంమఠం రాజు, భక్తులు పాల్గొన్నారు. అలాగే ఎలుకుర్తి, ఆరెపల్లి, చంద్రయపల్లి గ్రామాల్లో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల్లో సన్మానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమగాని సౌజన్య, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చాడా కొమురారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ జావీద్, మండల యూత్ అధ్యక్షుడు ఆకుల రుద్రప్రసాద్, మైదంశెట్టి సాంబయ్య పాల్గొన్నారు.

● సంగెం : మండలంలోని ఆలయాల్లో ఆలయ కమిటీల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. గవిచర్లలోని సీతారామాలయంలో వేడుకలు నిర్వహించారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి లింగాల నర్సింహారెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ లింగాల సరితభాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, ఎంపీటీసీ గూడ సంపత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దొనికెల రమశ్రీనివాస్‌లతో పాటు భక్తులు పాల్గొన్నారు. చింతలపల్లిలోని శ్రీభవానీ శంకర ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ ఇండ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రధాన పూజారి సముద్రాల సుదర్శనాచార్యులు, పురోహితులు వేణుగోపాలాచార్యులు, శ్రీహర్షచార్యులు సీతారాముల పెళ్లి తంతు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకవచ్చి ఆలయంలోని కల్యాణ మండపంలో కన్నుల పండువగా జరిపించారు. గుంటూరుపల్లిలోని శ్రీరామాలయంలో సీతరామయ్యల పెళ్లిని గ్రామస్థులు కలిసికట్టుగా నిర్వహించారు. రాంచంద్రాపురం, కాట్రపల్లి, ఎల్గూరురంగంపేట గ్రామాల్లో గల ఆలయాల్లో శ్రీసీతారాముల కల్యాణ వేడుకలను ఘనంగా జరిపించారు.

● సంగెం : నగరంలోని 17వ డివిజన్ స్తంభంపల్లి భక్తాంజనేయ స్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. వసంతాపురం గ్రామంలోని భక్తాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీసీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మొక్కులు సమర్పించుకున్నారు. స్తంభంపల్లిలో జరిగిన కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు కుంచాల చేరాలు, ప్రధాన కార్యదర్శి పోచన శ్రీనివాస్, కమిటీ ప్రతినిధులు సుధాకర్, మధు, శ్రీనివాస్, రాజు, రవి, తదితరులు పాల్గొన్నారు.

43వ డివిజన్ తిమ్మాపురం హవేలిలో శ్రీసీతారామ ప్రసన్నాంజనేయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రజలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు డాక్టర్ బోగవెల్లి కిషన్‌రావు, గోవిందరావు, మధుకర్‌రావు, రాజగోపాల్ రావు, సదానందం, రంజిత్‌రావు, సుభాష్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రసాదరావు, వెంకటేశ్వర్లు, రమేష్, సతీష్, చెన్నారెడ్డి పాల్గొన్నారు. మామునూరు గ్రామంలోని శ్రీసీతారామంజనేయ స్వామి దేవాలయాల్లో ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. మహా అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో ట్రస్ట్ ప్రతినిధులు రామచంద్రం, లక్ష్మారెడ్డి, దేవేందర్‌రెడ్డి, లింగమూర్తి, కుమారస్వామి, సాంబయ్య యాదవ్, రాజిరెడ్డి, ఓదెలు పాల్గొన్నారు.



నగరంలోని రంగశాయిపేట సీతారామచంద్ర స్వామి ఆలయంలో తలంబ్రాల ఘట్టాన్ని నిర్వహిస్తున్న ధర్మకర్తలు



రంగశాయిపేటలో ఉత్సవ మూర్తులను దర్శించుకుంటున్న మేయర్



చింతల్‌లోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో మంగళసూత్రాన్ని భక్తులకు చూపిస్తున్న అర్చకుడు



గోవిందరాజుల గుట్టపై సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు



దయానందకాలనీ శ్రీకనుకదుర్గా మాతా దేవాలయంలో సీతారాముల కల్యాణ వేడుకలను నిర్వహిస్తున్న అర్చకులు



చంద్రయ్యపల్లిలో సీతారాముల కల్యాణంలో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి



వరంగల్ వేణుగోపాలస్వామి ఆలయంలో కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



పైడిపెల్లిలోని శివాలయంలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



లేబర్‌కాలనీ పంచముఖ నాగవీరేశ్వరస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



శంభునిపేటలోని గోకులం అపార్ట్‌మెంట్స్‌లో సీతారాముల కల్యాణ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



ఎస్ఆర్ఆర్ తోటలో నిర్వహించిన కల్యాణంలో పాల్గొన్న గంట రవికుమార్



విశ్వనాథ్‌కాలనీలో కల్యాణ వేడుకలకు హాజరైన ప్రదీప్‌రావు

మడికొండలో సీఎం సభాస్థలి పరిశీలన

మడికొండ, ఏప్రిల్ 17: సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 24న హనుమకొండ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు బహిరంగ సభ నిర్వహణ కోసం బుధవారం లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మడికొండలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీఎం సభ కోసం మడికొండ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్‌రెడ్డి, కడియం శ్రీహరి

ఏకలవ్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

▸▸ ఎరుకల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకిని రాజు

వరంగల్‌సిటీ, ఏప్రిల్ 17: హైదరాబాద్ కేంద్రంగా ఎరుకల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏకలవ్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎరుకల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకిని రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని ఎల్బీనగర్‌లో బుధవారం ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు కేతిరి రాజశేఖర్, మండల అధ్యక్షుడు పాలకుర్తి నారాయణ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాజు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని ఎస్టీ స్టడీ సర్కిల్‌లో ఇతర గిరిజన విద్యార్థులతో పోల్చుకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆదివాసీ, ఎరుకల విద్యార్థులకు విద్య సరిగ్గా అందక వెనకబడి ఉన్నారని తెలిపారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎరుకల ఎంపవర్‌మెంట్ స్కీం కింద రూ.60 కోట్ల నిధులను మంజూరు చేసి 138 పందుల సహకార సంఘాలకు ఐదు ఎకరాల చొప్పున ప్రభుత్వ భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ఓని సదానందం, పల్లకొండ హరికుమార్, సురేష్, విజయ్‌కుమార్, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లోకిని రాజు



మత్స్యకారుల వలలో చిక్కిన మొసలి

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 17 : నర్సంపేట మండలం మాధన్నపేట చెరువులో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుల వలలో మొసలి చిక్కిన సంఘటన బుధవారం సాయంత్రం జరిగింది. మత్స్యకారుల కథనం ప్రకారం... మాధన్నపేట చెరువులో మత్స్యకారులు చేపల కోసం వల వేయగా అందులో మొసలి చిక్కింది. విషయాన్ని మత్స్యకారులు నర్సంపేట అటవీశాఖ అధికారులకు అందించారు. వెంటనే అధికారులు మాధవన్నపేట చెరువు వద్దకు వచ్చి మొసలిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పాఖాల సరస్సులో మొసలిని వదిలినట్లు ఎఫ్ఆర్ఓ రవికిరణ్ తెలిపారు. ఇదిలావుండగా గత రెండేళ్ల క్రితం మాధన్నపేట చెరువులో మొసలిని చూసినట్లు కొందరు తెలపడంతో కొద్ది రోజులు చెరువులోకి వెళ్లడానికి ఎవరూ సాహసించలేదు.



మాధన్నపేట చెరువులో వలలో చిక్కిన మొసలి

నామినేషన్ స్వీకరణలో పొరపాట్లు జరగొద్దు

• వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 17 : నామినేషన్ల స్వీకరణలో సిబ్బంది జాగ్రత్తగా విధులు నిర్వహిస్తూ ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ప్రక్రియను పూర్తి చేయాలని వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన మాక్ (ట్రయల్) నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు సమర్పించే బ్యాంకు ఖాతా, ఫొటోగ్రఫీ తదితర అంశాలపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. నామినేషన్లపై సిబ్బందికి సంపూర్ణ అవగాహన ఉండాలన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్కును పరిశీలించి ప్రతిరోజు ఎన్నికల సంఘానికి నివేదికలను నిశితంగా పరిశీలించి పంపాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్వో శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్, తహసీల్దార్ ఇక్బాల్, విజయ్‌సాగర్, డీటీ రంజిత్ పాల్గొన్నారు.

హెల్ప్ డెస్క్ ఏర్పాటు

లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కానుండటంతో అభ్యర్థుల సౌకర్యార్థం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నామినేషన్ హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. అభ్యర్థులు దరఖాస్తు నింపే సమయంలో తలెత్తే సమస్యలను ఈ హెల్ప్ డెస్క్‌లో నివృత్తి చేయనున్నారు. ఎలాంటి తప్పులు దొర్లకుండా దరఖాస్తు నింపడంలో హెల్ప్‌డెస్క్ సిబ్బంది అభ్యర్థులకు సహకరించడం జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు.

తిమ్మంపేటలో తాగునీటి ఎద్దడి



ట్యాంక్ వద్ద క్యూలో పెట్టిన క్యాన్లు

దుగ్గొండి, ఏప్రిల్ 17: వేసవికాలం దృష్ట్యా అడుగంటిన జలాలతో బోరులు పనిచేయకపోవడంతో తాగునీరు ఎద్దడిని ప్రజలు ఎదుర్కొంటున్నారు. మండలంలోని తిమ్మంపేటలో రెండు బోరులు, రెండు బావులు ఉన్నాయి. బావులనీరు కాలకృత్యాలకు వాడుకోగా రెండు బోరుబావులను తాగునీరు కోసం ఉపయోగిస్తారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా బోర్లలో నీరు అడుగంటి పైపులకు నీరు అందని దుస్థితి ఏర్పడింది. 3,900జనాభా కలిగిన గ్రామంలో తాగునీటి కోసం వారం రోజులుగా అవస్థలు పడుతున్నట్లు ప్రజలు వెల్లడించారు. ఇతర గ్రామాల నుంచి వాహనాలలో తెస్తున్న 20లీటర్ల క్యాన్ నీటిని రూ.10ల చొప్పున కొనుగోలు చేస్తున్నామన్నారు. గతంలో ఎన్నడూ ఈ పరిస్థితిలేదని, వెంటనే అధికారులు స్పందించి బోరులను డ్రిలింగ్ చేసి పైపులు దింపాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

నల్లబెల్లి, ఏప్రిల్ 17 : యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని భువనగిరి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని మృతి చెందిన విద్యార్థి చినలచ్చి ప్రశాంత్(12) కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రకటించాలని దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి భట్టు సాంబయ్య కోరారు. మండల కేంద్రంలో బుధవారం సాంబయ్య మాట్లాడుతూ.. ఈ ఘటనపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ చేపట్టి, విద్యార్థి మృతికి కారణమైన దోషులకు చట్టపరమైన శిక్ష విధించాలని ప్రభుత్వాన్ని కోరారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

రామ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు

భక్తులతో కిటకిటలాడిన కల్యాణ మండపాలు

నర్సంపేట, ఏప్రిల్ 17 : శ్రీరామనవమిని పురస్కరించుకొని నర్సంపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో బుధవారం సీతారాముల కల్యాణ వైభోగం కన్నుల పండువగా జరిగింది. అందులో భాగంగా నర్సంపేట పట్టణంలోని వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య రాములోరి కల్యాణ వేడుక వైభవంగాసాగింది. ఉదయం నుంచి ఆలయాలకు మహిళలు, భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.శ్రీరామనామంతోఆలయాలు మార్మోగాయి. పట్టణంలోని శివాంజనేయస్వామి ఆలయంలో ఆలయ కమిటి అధ్యక్షుడు నల్లమనోహర్‌రెడ్డి, విజయదంపతులు, మేరుగు లక్ష్మన్‌బాబు, దండురాజు దంపతులచే సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీమునిసిపల్ చైర్మన్ నాగెల్లి వెంకటనారాయణగౌడ్, చింతల నిరంజన్, ఆకుల ప్రభాకర్‌తో పాటు ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు. వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ కమిటి చైర్మెన్ ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ముడుంబై రామానుజచార్యుల వేదమంత్రోచ్చరణల నడుమ రాములోరి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు. పట్టణంలోని ద్వారకపేటలోని వేణుగోపాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ కమిటీ ప్రతినిధులు గందం నరేందర్ ఇతర సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శ్రీధరచార్యులు వేదమం త్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని శ్రీధర్మశాస్త్రాఅయ్యప్పస్వామి దేవాలయం ఆవరణలోని అభయాంజనేయస్వామి ఆలయంలో అయ్యప్ప ఆలయ సేవా ట్రస్టు చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ రజని దంపతులతోపాటు పలువురు భక్తుల దంపతులచే అర్చకుడు నిశాంత్‌శర్మ వేదమంత్రోచ్చరణల నడుమ సీతారాములు కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు శ్రీరాం ఈశ్వరయ్య, బూపతి లక్ష్మీనారాయణతో పాటు కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు. సాయిబాబా దేవాలయంలో భక్తుల మధ్య ఆలయ అర్చకులు సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. రామాలయం, సాయిబాబా ఆలయాల్లో శ్రీరామనవమి సందర్భంగా బీజేపీ నియోజకవర్గ చేరికల కమిటీ చైర్మన్ గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కంభంపాటి ప్రతాప్, జిల్లా కార్యదర్శి రేసు శ్రీనివాస్, నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపల్లి నర్సింహరాములు, బాల్నెజగన్, గూడూరు సందీప్, కొంపెల్లి రాజు. సప్తగిరి తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. సీతాములు విగ్రహాలను వేడకు పందిరిలోకి రెడి సంఘం నాయకులు ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి, మల్లాడి రవీందర్‌రెడ్డి, బొద్దిరెడ్డినర్సింహారెడ్డిలు తీసుకువచ్చారు. వేడుకలో కటుకూరిజయపాల్‌రెడ్డి, కుందూరువెంకట్‌రెడ్డి, చెరుకుపల్లి గోపాల్‌రెడ్డి, గోలి నర్సింహారెడ్డి, బుర్ర మోహన్‌రెడ్డి, పల్లె శ్రీనివాస్‌రెడ్డి, మోదె సంపత్‌రెడ్డి, తొగరు మల్లారెడ్డి పాల్గొన్నారు. ఆలయాల్లో సీతారాములకు నూతన వస్త్రాలు అందించడం, తాళికట్టే, ముత్యాల తలంబ్రాలుపోసే తంతును అర్చకులు వైభవంగా నిర్వహించారు, రాములోరి కల్యాణ మహోత్సవం అనంతరం వేడుకలకు వచ్చి భక్తులకు ఆయా ఆలయాల వద్ద పులిహోర, తీర్థ ప్రసాదాలను అందించారు.

• నెక్కొండ : మండలంలోని గ్రామాల్లో సీతారాముల కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. నెక్కొండ శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, పంచముఖాఅంజనేయ స్వామి ఆలయంలో చైర్మన్ బెజ్జంకి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో, గన్ను జనార్దన్ కాంప్లెక్స్‌లో ఆలయ అర్చకులు టీవీఎస్ శాస్త్రి, శ్రావన్, భవిశాస్త్రిలు కల్యాణాలు జరిపారు. రామాలయం, అంజనేయస్వామి, పంచముఖాఅంజనేయస్వామి దేవాలయాల్లో భక్తులకు చైర్మన్ ఎర్రబెల్లి సంపత్‌రావు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. పత్తిపాక, బొల్లికొండ గుట్టపై శ్రీరామనవమి సందర్భంగా జరిగిన జాతరల్లో భక్తులు వేల సంఖ్యలో పాల్గొన్నారు.

• దుగ్గొండి : మండలంలోని నాచినపల్లిలో రామాలయం, కేశవాపురంలో వెంకటేశ్వరస్వామి దేవాలయం, తిమ్మంపేటలో లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణోత్సవాలు నిర్వహించారు. కేశవాపురంలోని ఆలయ నిర్మాణకర్త కంది జితేందర్‌రెడ్డి, సరళ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. నాచినపల్లి దేవాలయ చైర్మన్ చెన్నూరి కిరణ్‌రెడ్డిలతో పాటు కమిటీ సభ్యులు పాల్గొని పండితులు వేద మంత్రోత్సవాలతో సీతారాముల కళ్యాణం నిర్వహించారు.

• ఖానాపురం : సీతారాముల కల్యాణ వేడుకలను మండల వ్యాప్తంగా వైభవంగా నిర్వహించారు. ఖానాపురం, అశోక్‌నగర్, రంగాపురం, ధర్మరావుపేట రామాలయాల్లో ఆలయ అర్చకులు పర్వతపు శివప్రసాద్‌శాస్త్రీ, శ్రీనివాసచార్యులు, కోటేశ్వశర్మ, నాగతేజ, రవితేజ, శ్రీకర్, అశీష్‌పాండేల వేదమంత్రోచ్చారణలతో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. బుధరావుపేట, మంగళవారిపేట, మనుబోతులగడ్డ, పెద్దమ్మగడ్డ ఆంజనేయస్వామి ఆలయాల్లో వేడుకలను నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రంగాపురం, ధర్మరావుపేటలో సీతారాముల కళ్యాణంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు.

• చెన్నారావుపేట : మండలంలోని ఎల్లాయిగూడెం, కోనా పురం. జల్లి, ఖాదర్‌పేట, గొల్లపల్లె పలు గ్రామాలల్లో బుధవారం శ్రీరామ నవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీసీతారామాజంనేయస్వామి దేవాలయంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో సాయిశాస్త్రి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. సిద్ధేశ్వరాలయంలో కంది విజయగోపాల్ రెడ్డి దంపతులు పాల్గొనగా భిక్షమయ్యశాస్త్రి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. పాత మగ్దుంపురంలో గ్రామస్థులు, యూత్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవా న్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం గ్రామాల్లో ఊరేగింపు కార్యక్రమాలను నిర్వహించారు. పలు చోట్లు అన్నదానం కార్యక్రమాలను చేపట్టారు.

• వర్ధన్నపేట రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. గ్రామాల్లోని సీతారాములు, శ్రీ ఆంజనేయ స్వామి ఆలయాల్లో కల్యాణ మహోత్సవాలు కన్నుల పండువగా నిర్వహించారు. అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా కళ్యాణం నిర్వహించి, భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందించారు.

వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలు క్షేమంగా ఆయురారోగ్యాలతో ఉండాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మొక్కులు చెల్లించారు. బుధవారం పట్టణంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో జరిగిన కళ్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణలో రామ రాజ్యం వచ్చిందని, దేశంలో సైతం వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచి రాహుల్ గాంధీ ప్రధానిగా కావాలని ఆకాంక్షించారు.

దేశంలో మళ్లీ రామరాజ్యమే రావాలని, అది ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో సాధ్యమని వరంగల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. బుధవారం పట్టణంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో జరగనున్న ఎంపీ ఎన్నికల్లో బీజేపీని ప్రజలు ఆదరించి, మూడోసారి నరేంద్ర మోదీని ప్రధాని చేయాలని ఆకాంక్షించారు.

• పర్వతగిరి : సీతారాముల కల్యాణాన్ని మండలంలోని గ్రామాల్లో వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంతోపాటు వడ్లకొండ, చింతనెక్కొండ, ఏనుగల్లు, అన్నారం, కల్లెడ, బూర్గుమళ్ల లోని రామాలయాల వద్ద సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.

• రాయపర్తి : మండలంలోని ఆయా గ్రామాల్లో సీతారామచంద్రస్వామి కల్యాణం కన్నుల పండుగగా జరిగింది. ఆలయాల్లోని అర్చకుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలుచేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. బురహాన్‌పల్లిలో నిర్వహించిన సీతారాముల కల్యాణంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండేలా చూడాలని మొక్కుకున్నట్లు తెలిపారు. మళ్లీ తెలంగాణలో కేసీఆర్ పాలనతో రామరాజ్యంవస్తుందని స్పష్టంచేశారు. ఇక మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహించిన కళ్యాణంలో ఎస్ఆర్ఆర్‌గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని కళ్యాణ మహోత్సవంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థుల కోరిక మేరకు కళ్యాణానికి రూ. 50,333 విరాళాన్ని అందించారు.



నర్సంపేట అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళసూత్రాన్ని చూపుతున్న అర్చకుడు



నర్సంపేట శివాంజనేయస్వామి ఆలయం ఆవరణలో...



వర్ధన్నపేటలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు



వర్ధన్నపేటలో వరంగల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి



ధర్మరావుపేటలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



బురాహాన్‌పల్లిలో మాజీ మంత్రి దయాకర్‌రావు

ఆఖరి మజిలీకి అగచాట్లు


వైకుంఠధామాల్లో అరకొర వసతులు

అస్తికలను ధ్వంసం చేస్తున్న అపరిచితులు

ఇబ్బందులు పడుతున్న మృతుల బంధువులు

పట్టించుకోని పాలకులు, అధికారులు

నర్సంపేటటౌన్, ఏప్రిల్ 17 : మనిషి మరణించిన తర్వాత నిర్వహించే ఆఖరి మజిలీ ఘట్టం అత్యంత కీలకం, ఉబికి వస్తున్న దుఃఖాన్ని దిగమింగుకొని అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు వైకుంఠధామాలకు వెళ్లే మృతుల కుటుంబ సభ్యులకు అక్కడి అసౌకర్యాలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన వైకుంఠధామాలు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. నర్సంపేటడివిజన్‌లోని నర్సంపేట, నల్లబెల్లి, దుగ్గొండి, ఖానాపురం, చెన్నారావుపేట, నెక్కొండ మండలాల్లోని ప్రతీ గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో ఒక్కో వైకుంఠధామానికి రూ.10లక్షల నుంచి రూ.15 లక్షల వరకు వెచ్చించి నిర్మించారు. కాంట్రాక్టర్లు తమ ఇష్టారాజ్యంగా పనులను నాణ్యత లోపంతో చేపట్టడం, కరెంటు, నీటి సౌకర్యం ఇవ్వకపోవడంతో మృతుల అంతిమ సంస్కారాలకు ఆగమాగంకావాల్సిన దుస్థితి నెలకొంది. అరకొర వసతులతో వైకుంఠధామాలు నిర్మించడంతో ప్రజలు వాటికి సమీపంలోని బోర్లు, చెరువుల వద్ద స్నానాలు చేయడం, ఇతర దహన సంస్కార కార్యక్రమాలను నిర్వహించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.



నర్సంపేట పట్టణంలోని హిందూ శ్మశాన వాటిక



అరకొర వసతులతో రాజుపేట వైకుంఠధామం



నర్సంపేట శ్మశాన వాటికలో చేతిపంపు

సౌకర్యం లేక ఇక్కట్లు..

నర్సంపేట మునిసిపాలిటీ పరిధిలో మాధన్నపేట రోడ్, వరంగల్ రోడ్డులో హిందూ స్మశానవాటికలు ఉన్నాయి. ప్రతీ రోజు ఇద్దరు, ముగ్గురు వేర్వేరు కారణాలతో మృతి చెందడం జరుగుతుంది. మృతుల అంతిమ సంస్కారాలకు శ్మశాన వాటికలకు వెళ్లితే స్నానాల గదులు నీటి సౌకర్యం లేకపోవడంతో బోరింగ్‌ను ఆశ్రయించాల్సిన పరిస్థితి. అందులోనూ రెండు శ్మశాన వాటికలో ఒక్కో బోరు మాత్రమే ఉండ డంతో బంధువులు ఇబ్బందులెదుర్కోవాల్సివస్తుంది.రాత్రి వేళల్లో లైట్లు వెలగక ఇబ్బందులు పడాల్సిన దుస్థితితో ప్రజలు పాలకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

శవం కాల్చిన బూడిదలో..

నర్సంపేట పట్టణంలోని హిందూశ్మశాన వాటికలో గత కొద్ది రోజులుగా గుర్తు తెలియని వ్యక్తులు హల్‌చల్ చేస్తున్నారు. శవాలను కాల్చిన బూడిదలో బంగారం, వెండి ఆభరణాల కోసం బూడిదను చిందర వందర చేయడంతో బూడిదను సేకరించే సమయంలో అవస్థలు పడాల్సివస్తుందని మృతుల బంధువులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. స్మశానవాటికలో చెట్టు కొమ్మలకు చుట్టిన ఆస్థికల కుండలను ధ్వంసం చేయడంపై అసహనం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా శ్మశాన వాటికల్లో సమస్యలను పరిష్కరించి, రాత్రి వేళల్లో కాటికాపరిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

అగ్ని ప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలి

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 17 : అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వర్ధన్నపేట ఫైర్ స్టేషన్ అధికారి భద్రయ్య సూచించారు. బుధవారం మండలంలోని ఇల్లందలో అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో, గ్యాస్‌గోదాంలో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి వాటిని నివారించడమే లక్ష్యంగా మరో ఐదు రోజుల పాటు కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 17 : మండలంలోని కట్ర్యాలలో బుధవారం వరంగల్ ఎంపీ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌ను గెలిపించాలని కోరుతూ బీజేపీ ఓబీసీ రాష్ట్ర మోర్చా కార్యవర్గ సభ్యుడు జడ సతీష్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా 225, 226 బూత్‌లలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జి, మండల అధ్యక్షుడు చెంగల సురేష్, చిర్ర రాకేష్, బండారి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితంలేని యువకుడి ఆత్మహత్య



దుగ్గొండి, ఏప్రిల్ 17 : మతిస్థిమితంలేని యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గోపాలపురంలో బుధవారం జరిగింది. ఎస్సై పరమేశ్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన కట్కూరి ప్రమోద్ (28) గత కొంతకాలం నుంచి మతిస్థిమితం కోల్పోయాడు. గ్రామంలో దుబారాగా తిరుగుతాడు. బుధవారం ఇంట్లో ఏవరు లేని సమయంలో ఉరి వేసుకొని మృతి చెందడు.. మృతుడి తల్లి రాజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదాలకు నిలయంగా అంబేద్కర్ సెంటర్..!

ఎదురొచ్చే వాహనాలు కనిపించక ఇబ్బందులు

స్పీడు బ్రేకర్లు లేక ప్రమాదాలు

సూచిక బోర్డులు పెట్టాలని డిమాండ్

బారికేడ్లు ఏర్పాటు చేయాలంటున్న స్థానికులు



ఇటీవల ప్రమాదానికి గురైన కారు, ద్విచక్ర వాహనం (ఫైల్)



వర్ధన్నపేటలోని అంబేద్కర్ సెంటర్

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 17 : వర్ధన్నపేట పట్టణంలో అంబేద్కర్ సెంటర్ ప్రమాదాలకు నిలయంగా మారింది. వరంగల్ ఖమ్మం జాతీయ రహదారి పై ఏర్పాటు చేసిన సర్కిల్ చూసేందుకు సుందరంగా కనిపిస్తున్నప్పటికీ మృత్యువు ఎటు నుంచివస్తుందో తెలియక వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా గతంలో ఉన్న అంబేద్కర్ విగ్రహన్ని తీసి హైవేపై నడి మధ్యలో ఏర్పాటుచేసి దానికి సర్కిల్ నిర్మాణం చేశారు. దీంతో ఎదురుగా వస్తున్న వాహనాలను, వాటి వేగాన్ని గమనించిక మరో వైపు నుంచి వెళ్లే వాహనాలు డివైడర్‌ను దాటుతున్న క్రమంలో ప్రమాదాలకు గుర వుతున్నాయి. వరంగల్ నుంచి తొర్రూరు వైపు వెళ్లాల్సిన వాహనాలు నేరుగా వెళ్తున్నప్పటికీ, తొర్రూరు నుంచి వరంగల్ వైపు వచ్చే వాహనాలే ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నాయి. వర్ధన్నపేట నుంచి జాఫర్‌గఢ్‌కు వెళ్లే వాహనాలు అటుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో ఈ సమస్య ఏర్పడుతోంది.

సూచిక బోర్డులు, స్పీడు బ్రేకర్లు లేవు..

అంబేద్కర్ సెంటర్‌ను విశాలంగా చేసినప్పటికీ వాహనాలు పాసయ్యే చోట అధికారులు చర్యలు తీసుకోలేదు. జంక్షన్ వద్ద నిత్యం ప్రజలు సంచరిస్తుండడంతో పాటు వివిధ గ్రామాలకు వెళ్లే ఆటో స్టాండ్లు, వెజ్, నాన్‌వెజ్ దుకాణాలు ఉన్నాయి. మరో వైపు జాఫర్‌గఢ్‌కు వెళ్లాల్సిన వారు జాతీయ రహదారిని క్రాస్ చేసి వెళ్లాల్సి ఉంటుంది. ఇటువంటి ప్రదేశంలో సంబంధిత అధికారులు ఎలాంటి సూచిక బోర్డులు, స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయలేదు. దీంతో హైవే పై వెళ్లే వాహనాలు వారి స్పీడును అలానే కొనసాగిస్తున్నారు. అంబేద్కర్ సెంటర్‌తో పాటు కొత్త బస్టాండ్ వద్ద సైతం చిన్న చిన్న వాహనాలు డివైడర్‌ను దాటి వెళ్లే సమయంలో రాంగ్ రూట్‌లో రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్ని రోజుల క్రితం దాదాపు ఓ ఆటో, ద్విచక్ర వాహనం, కారు ప్రమాదానికి గురయ్యాయి. వీటిలో పలువురికి గాయాలు కావడంతో ఊపిరి పీల్చుకున్నారు.

డివైడర్ ఎత్తుగా ఉండడంతో..

ముఖ్యంగా పట్టణంలో నిర్మించిన డివైడర్ ఎత్తుగా ఉండడం సైతం ప్రమాదాలకు మరో కారణంగా స్థానికులు చెపుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో అటుగా వచ్చే వాహనాలు సడెన్‌గా వెళ్తున్నాయని, దీంతో ప్రమాదం జరుగుతోందని వివరిస్తున్నారు. డివైడర్ వైపున భారీ వాహనాలు తప్ప, ఇతర చిన్న వాహనాలు కనిపించడం లేదంటున్నారు. జంక్షన్‌లో నిబంధనల ప్రకారం యూటర్న్ తీసుకునే వాహనాలు చుట్టూ తిరిగి వెళ్లకుండా ఇష్టానుసారంగా వెళ్లడంతో వేగంగా వచ్చే వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయని స్థానికులు స్పష్టం చేస్తున్నారు. యూటర్నుల వద్ద వాహనాలు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు సూచిక బోర్డులు, డివైడర్ ఎండింగ్ దగ్గర స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేస్తే ప్రమాదాలు ఉండవని సూచిస్తున్నారు.

స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

నాగెల్లి సురేష్, వర్ధన్నపేట



నెలలో పదుల సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనపడకపోవడంతోనే ఈ సమస్య ఏర్పడింది. కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలే ఎక్కువగా ప్రమాదానికి గురవుతు న్నాయి. వేగంగా రావడం సడెన్ బ్రేక్ వేడయంతో స్వల్ప గాయాలతో బయటపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకుని, ప్రమాదాలు జరగకుండా చూడాలి. డివైడర్ల ఎండింగ్‌లో స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలి.